క్లుప్తంగా

విద్యార్థుల అభ్యున్నతితోనే దేశాభివృద్ధి



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ జాన్‌శామ్యూల్

పెద్దారవీడు: విద్యార్థులు చదువులో అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని డిప్యూటీ డీఈఓ జాన్‌శామ్యూల్ అన్నారు. మండలంలోని బద్వీడుచెర్లోపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధనలు చేయాలని, ఉన్నతి స్థాయికి ఎదిగేలా తయారు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని సూచించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచి మంచి నడవడికను అలవర్చుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. చిన్నప్పటి నుంచి చదువులో పోటీతత్వాన్ని పెంచుకోవాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థుల సామర్థ్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి విద్య బోధనపై పలు అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రధానోపాధ్యాయుడు పి.రత్నశంకర్‌నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ అధ్యక్షుడిగా బాలనాయక్



ఏపీటీఎఫ్ సబ్ కమిటీ సభ్యులు

కురిచేడు: ఏపీటీఎఫ్ మండల శాఖ నూతన అధ్యక్షుడిగా వి.బాలనాయక్ ఎన్నికయ్యారు. ఏపీటీఎఫ్ సబ్ కమిటీ మధ్యంతర సమావేశం స్థానిక ఎంపీయూపీఎస్ ఉర్దూ పాఠశాలలో మంగళవారం ఖాజారహంతుల్లా అధ్యక్షతన సమావేశమైంది. సమావేశంలో ఇప్పటి వరకు మండల శాఖ అధ్యక్షుడిగా పనిచేసిన పఠాన్ కరిముల్లా తన వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయడంతో నూతన అధ్యక్షుని ఎన్నిక అనివార్యమైంది. సబ్ కమిటీ ఏకగ్రీవంగా నూతన అధ్యక్షుడిగా బాల నాయక్‌ను ఎంపిక చేసింది. ఆయతో ఖాజారహంతుల్లా ప్రమాణ స్వీకారం చేయించారు. ఏపీటీఎఫ్ సబ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కళకళలాడుతున్న కంది

- ఏపుగా పెరిగిన పంట
- మొక్క నిండా పూత
- యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి

పుల్లలచెరువు:

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాధారంగా సాగైన కంది పంట ఆశాజనకంగా ఉంది. సకాలంలో వర్షాలు కురవడంతో మొక్కలు బాగా బతికి చెట్టు ఏపుగా పెరిగి చెట్టు నిండా పూత పెట్టింది. రైతులు శ్రద్ధతో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాఖాధికారులు తెలియజేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో పత్తి, మిరప పంటలతో పాటు చాలామంది రైతులు దానికి సమానంగా కంది పంటను సాగు చేశారు. ఈ ఏడాది అనుకోకుండా వరుణ దేవుడు కరుణించడంతో వేసిన ప్రతి పంటా ఏపుగా పెరిగింది. యర్రగొండపాలెం నియోజకవర్గంలో వందల హెక్టార్లలో రైతులు కంది పంట సాగు చేసినట్లు అధికారులే చెబుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సకాలంలో పడటంతో పత్తి, మిరపతో పాటు కంది పంటను సాగు చేశారు. ఇటీవల కురిసిన చెదురు మొదురు వర్షాలకు చెట్లు ఏపుగా పెరిగి చెట్టునిండా పూత పెట్టింది. పంట ఆశాజనకంగా ఉండటంతో జనవరి, ఫిబ్రవరి నెలల్లో దిగుబడి కూడా ఆశించినా మేరకు వస్తుందనే భావనతో రైతులు ఎదురు చూస్తున్నారు. యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలు. కంది పంటలో యాజమాన్య పద్ధతి పాటిస్తే ఆశించిన మేరకు దిగుబడి పొందే అవకాశం ఉంది. సాధారణంగా పూతదశ నుంచి వివిధ రకాల చీడపీడలు సోకే అవకాశం ఉంది. అందులో ఆకుచుట్టు పురుగు, కాయ తొలుచు పురుగు, మచ్చల పురుగు ఇలాంటివి ఎన్నో ఆశించే అవకాశం ఉంది. వీటిని నివారించేందుకు విపరీతంగా రసాయనాల వాడకం మంచిదికాదు. కంది పంట పెరిగే దశలో ఆకుపచ్చ పురుగు ఆశిస్తుంది. ఆకులు పూతను చుట్టుకుని లోపల ఉండి పోతుంది. దీని నివారణకు లీటర్ నీటికి 1.6 మిలీ మోనోక్రోటాపాస్ లేదా 2 మిలీ చొప్పున క్వినాల్‌ఫాస్ కలిపి పిచికారీ చేయాలి. పూత, పిందే దశలో కాయలకు రంధ్రాలు చేసి గింజలను తింటూ ఒక కాయ నుంచి మరో కాయకు ఆశిస్తుంది. వీటి నివారణకు పురుగులను తినే పక్షులను ఆకర్షించేందుకు వీలుగా ఎకరాకు 20 పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలి. చెట్టను బాగా కదిపి కింద పడిన పురుగులను నాశనం చేయాలి. యాజమాన్య పద్ధతులను సకాలంలో చేపట్టలేనప్పుడు తప్పని సరైతే పూత లేదా కాయదశలో క్వానాల్ పాస్ 2 మిలీ, ఎసిపేట్ 1.5 గ్రాములను లీటర్ నీటికి పిచికారీ చేయాలి.



కళకళలాడుతున్న కంది పంట

> **ధరలు ఉంటే మంచి లాభం**
>
> నేను 20 ఎకరాల్లో కంది పంట సాగు చేశా. గతంలో ఎప్పుడూ లేనంతగా ఇప్పుడు కంది పంట బాగుంది. చాలా సంవత్సరాల తర్వాత పురుగు తక్కువగా ఉండటంతో పంట బాగుంది. ఇలా ఉంటే దిగుబడి కూడా బాగుంటుంది. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటిస్తే రైతులు ఎంతోలాభ పడతారు.
>
> – పి.కృష్ణారావు, రైతు, పుల్లలచెరువు

గ్రామాల అభివృద్ధే అందరి లక్ష్యం



దొనకొండ: శిక్షణకు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు



పెద్దారవీడులో మాట్లాడుతున్న ఎంపీడీఓ జాన్‌సుందరం

పెద్దారవీడు: గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెట్టించడమే మనందరి లక్ష్యమని ఎంపీడీఓ జాన్‌సుందరం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశం హాలులో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై మంగళవారం వివిధ శాఖల అధికారులకు ఆయన శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను ఆదర్శంగా తీర్చదిద్దేందుకు పక్కా ప్రణాళికలు రచించాలని, గ్రామాల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. గ్రామంలో మౌలిక వసతులు సౌకర్యవంతంగా ఉండాలని సూచించారు. పేదరికం లేని గ్రామంగా, ఆరోగ్యవంత గ్రామంగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్య ఉద్దేశమని, గ్రామ పంచాయతీల అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. అందరికీ సమన్యాయం, నీటి సమృద్ధి, పారిశుధ్యం, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. ఈఓఆర్డీ రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

దొనకొండ: పంచాయతీల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ ఎం.శ్రీదేవి సూచించారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి 2వ రోజు గ్రామ స్వరాజ్ అభియాన్ కింద శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి పని చేసి పంచాయతీల అభివృద్ధికి కృషి చేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. పంచాయతీలకు వచ్చే నిధులు, రాబడి దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా గ్రామాభివృద్ధికి ప్రణాళిక తయారు చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు. ఈఓఆర్‌డీ ఆదాం సాహెబ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు బజార్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- జేసీ గోపాలకృష్ణ



రైతు బజార్‌లో జరిగిన సభలో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

యర్రగొండపాలెం: రైతు బజార్‌ను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక పుల్లలచెరువు రోడ్డులో ఉన్న రైతు బజార్‌ను ఆయన వినియోగంలోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రైతు బజార్‌లో రైతులు పండించిన తాజా కూరగాయలను తక్కువ ధరలకు ప్రజలకు అమ్మకాలు జరుపుతారన్నారు. నియోజకవర్గంలోని పెద్దదోర్నాలలో కూడా రైతు బజార్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్, మార్కెట్ యార్డ్ ఏడీ ఉపేంద్రకుమార్ పాల్గొన్నారు.

గత ప్రభుత్వం కృషి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గతంలో రైతులు దళారుల భారీన పడకుండా ఉండేందుకు రైతు బజార్ ఏర్పాటుకు రూ.1.28 కోట్లు మంజూరు చేసింది. ఈ రైతు బజార్ 2022 ఆగస్టు 24వ తేదీన అప్పటి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రారంభించారు. రైతు బజార్ భవన నిర్మాణ పనులు పూర్తికాకపోవడం, అప్పటి రాజకీయ పరిణామాల కారణంగా రైతుల వినియోగంలోకి తీసుకొని రాలేకపోయారు. ఇటీవల కాలంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా నిరుపయోగంగా ఉన్న రైతు బజార్ భవనాన్ని పరిశీలించి వెంటనే రైతులకు అంకితం చేసి వినియోగంలోకి తీసుకు రావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ చర్యలతో రైతులకు, కూరగాయల వినియోగదారులకు ఎంతగానో మేలు జరిగింది.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



దొనకొండ: గంగదేవిపల్లిలో గ్రామసభ



పెద్దారవీడు: రైతు నుంచి అర్జీ స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ ఇబ్రహీం ఖలీల్

పెద్దారవీడు: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ ఇబ్రహింఖలీల్ అన్నారు. మండల పరిధిలోని ప్రగళ్లపాడు ఎంపీపీ పాఠశాలలో గ్రామ రెవెన్యూ సదస్సు మంగళవారం నిర్వహించారు. డీటీ మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను తమ దృష్టికి తెస్తే వాటిని రీ సర్వే చేసి పరిష్కారిస్తామని తెలిపారు. రైతులు గ్రామ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతుల నుంచి సమస్యలతో పాటు భూ సమస్యలకు సంబంధించిన అర్జీలు స్వీకరించారు. ఆర్‌ఐ గోపి, మండల సర్వేయర్ రామగోపాలరెడ్డి, వీఆర్వో విజయ రవితేజ, స్థానికులు కంచర్ల సుబ్బయ్య, ముడమంచు కొండగురవయ్య, పులి సుబ్బయ్య, గుమ్మా కొండగురవయ్య పాల్గొన్నారు.

దొనకొండ: మండలంలోని గంగదేవిపల్లిలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ బి.రమాదేవి మాట్లాడారు. ఈ సందర్భంగా రైతుల నుంచి 76 అర్జీలు అందాయి. అందులో 71 ఈ-పాస్ పుస్తకాలకు, 5 అర్జీలు భూ సర్వే కోసం వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఆర్‌ఐ రామారావు, వీఆర్‌ఓ తాళ్ల శివకోటేశ్వరరావు, సర్వేయర్ బి.శ్రీనివాసులు, లైసెన్స్ సర్వేయర్ వెంకట్రావు పాల్గొన్నారు.



పెద్దదోర్నాల: ఐనముక్కల సదస్సుకు హాజరైన అధికారులు

పెద్దదోర్నాల: రెవెన్యూ సదస్సుల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ శాంతి తెలిపారు. మండల పరిధిలోని ఐనముక్కలలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. గ్రామంలో పొలాల మధ్య ఉన్న వివాదాలు, రహదారుల సమస్యలు, భూములు ఆక్రమించుకోవటం తదితర సమస్యలను రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా పాసు పుస్తకాల కోసం నాలుగు అర్జీలు వచ్చినట్లు ఆమె తెలిపారు. సర్వేయర్ సురేష్ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో బాలాత్రిపురసుందరీదేవి

త్రిపురాంతకం: శ్రీబాలాత్రిపురసుదరీదేవి, శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. త్రిపురాంతకంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజల సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చనలు, స్వామివారికి అభిషేకం చేశారు. మార్గశిర మాసంలో ప్రత్యేకంగా ఆలయాల్లో జరుగుతున్న ప్రత్యేక పూజల్లో పాల్గొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాదాలు, ఆశీర్వచనం అందించారు.



పూజలందుకుంటున్న త్రిపురాంతకేశ్వరస్వామి

వ్యవసాయ అనుబంధ రంగాలను ఎంచుకోవాలి



రైతులకు కోళ్లు అందజేస్తున్న అధికారులు

దర్శి: రైతులు, మహిళా రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలను కూడా ఎంచుకోవాలని కేవీకే హెడ్ రమేష్ సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో షెడ్యూల్ క్యాస్ట్ రైతులు, మహిళలకు వ్యవసాయ అనుబంధ రంగాలపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ వ్యవసాయం చేయని వారు వ్యవసాయ అనుబంధ రంగాలైన పెరటి కోళ్ల పెంపకం, గొర్రెలు, మేకల పెంపకం, పుట్టగొడుగులు పెంపకం వంటి వాటిని వ్యవసాయ రంగాలపై ఆధార పడుతూ వ్యవసాయం చేస్తే వ్యవసాయానికి అనుసంధానంగా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. ఒక్క వ్యవసాయంపైనే ఆధారపడితే ప్రకృతి వైపరీత్యాల సమయంలో లేదా ఇతర కారణాలతో పంట నష్టాలు వచ్చే అవకాశాలు ఉంటాయని చెప్పారు. దీన్ని నియంత్రించాలంటే రైతులు ఆర్థికాభివృద్ధి సాధించే అంశాలు దోహదపడతాయన్నారు. పశు వైద్యాధికారి బసవయ్య మాట్లాడుతూ పశువుల్లో వచ్చే వివిధ వ్యాధుల గురించి రైతులకు వివరించారు. కోళ్ల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం రైతులకు పెరటి కోళ్లను ఉప ప్రణాళికలో భాగంగా 50 మంది ఎస్సీ రైతులకు ఒక్కొక్కరికి 15 కోళ్లు చొప్పున మొత్తం 750 కోళ్లను పంపిణీ చేశారు. ఫామ్ మేనేజర్ కె.సంధ్యారాణి, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త టి.మానస పాల్గొన్నారు.

పెన్షనర్లకు వైద్య పరీక్షలు

దర్శి: పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఐదు మండలాల్లోని పెన్షనర్‌లకు వైద్య మంగళవారం వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ 120 మంది పెన్షనర్‌లకు ఆరోగ్య పరీక్షలు చేశారు. మీనాక్షి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సీతాకాలంలో వచ్చే వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనారోగ్యం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై వారికి అవగాహన కల్పించారు. సభ్యులు ఎస్ఎన్‌సీహెచ్ సుబ్బారావు, పి.నాసరయ్య, టి.రంగయ్య, జి.వెంకటేశ్వర్లు, ఎస్. అంజిరెడ్డి, ట్రెజరీ, ఐసీఐసీఐ బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేయించుకోవాలి



యర్రగొండపాలెం: మిరప పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



దొనకొండ: కంది పంటను పరిశీలిస్తున్న ఏఓ

దొనకొండ: రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఈ-పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ సూచించారు. మంగళవారం పెదన్నపాలెం, గంగదేవిపల్లి రైతులతో రైతు సేవా కేంద్రంలో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వరి, మొక్కజొన్న, మినుము, పప్పు శనగ, ఎండు మిరప సాగు చేసిన వారు తప్పకుండా ఈ-పంట నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం పెదన్నపాలెంలో కంది, మిరప పంటలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు అందజేశారు. ఆయన వెంట సిబ్బంది అరుణాదేవి, వీణాకుమారి పాల్గొన్నారు.

పుల్లలచెరువు: రబీలో సాగు చేసిన మొక్క పంటలో తగు జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించే వీలుంటుందని వ్యవసాయ విస్తరణాధికారి గోపీకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని మర్రివేములు, శతకోడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో మొక్కజొన్న పంటను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. మొక్క జొన్న పంటలో కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, దాని నివారణకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రబీలో సాగు చేసిన ప్రతి పంటకు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. త్వరలోనే కందుల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించందన్నారు. కంది పంటను సాగు చేసిన రైతులు సమీపంలో ఆర్బీకేల్లో వీఏఏలను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వీఏఏలు మస్తాన్, మంత్రునాయక్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

కురిచేడు: మండలంలోని వరిపైరులో ప్రస్తుతం ఆశించి ఉన్న ఆకుముడత తెగులును నివారించాలని మండల వ్యవసాయాధికారి మధుబాబు రైతులకు సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని పడమరవీరాయపాలెం, కురిచేడు గ్రామాల్లో సాగు చేసిన వరి పైరును పరిశీలించారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించుకోవాలని సూచించారు. ఆయన వెంట వీఏఏలు హారిక, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మిరపలో నల్లతామర పురుగు

యర్రగొండపాలెం: మిరప పంటలో నల్లతామర పురుగు ఆశించిందని, వెంటనే రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని ఉద్యానశాఖాధికారి పి.ఆదిరెడ్డి కోరారు. మంగళవారం మండంలోని తమ్మడపల్లి, గుర్రపుశాల గ్రామాల రైతులు పండిస్తున్న మిరప, కంది పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లతామర పురుగు ఆశించకుండా ఉండేందుకు పొలం గట్లపై ఉన్న కలుపును పూర్తిగా తొలగించి అంతర కృషి చేసుకోవాలన్నారు. రైతులు సామూహికంగా నీలిరంగు అట్టలను తమ పొలాల్లో 30 నుంచి 40 అట్టలను ఏర్పాటు చేసుకోవాలని, పురుగు నివారణకు లీటరు నీటికి ఐదు మిల్లీ లీటర్ల వేపనూనెను కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఏవో కేవీ శేషారెడ్డి మాట్లాడుతూ రబీలో పంటలు వేసిన ప్రతి రైతు ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని, ఖరీఫ్‌లో కంది పంటను విత్తుకున్న రైతులు తమ గ్రామాల్లో ఉన్న రైతు సేవా సిబ్బంది ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని కోరారు. వ్యవసాయ విస్తరణాధికారులు ఎల్.మాల్యాద్రిరెడ్డి, డి.ధనేశ్వర్‌నాయక్, వీఏఏలు సూరజ్ బాషు, మణి కుమార్ పాల్గొన్నారు.

దర్శి: సకాలంలో చీడపీడలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని వ్యవసాయాధికారి వి.బాలకృష్ణనాయక్ సూచించారు.

మండలంలోని తూర్పు వీరాయపాలెం, దర్శి-2 రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా బాలకృష్ణనాయక్ మాట్లాడుతూ శనగ రైతులు ఈ-క్రాప్ చేసుకోవాలని సూచించారు. ప్రతికూల పరిస్థితుల్లో పంట నష్టం వాటిల్లినప్పుడు, పంటలకు ఇన్సూరెన్స్ వర్తించాలంటే ఈ-క్రాప్ తప్పనిసరని చెప్పారు. పంటలను మార్కెట్‌లో గిట్టుబాటు ధరలకు అమ్ముకోవాలన్నా పంట నమోదు అవసరమని చెప్పారు. పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు వేసుకోవాలని సూచించారు. వ్యవసాయ సహాయకులు జి.మనోహర్, రైతులు పాల్గొన్నారు.



పుల్లలచెరువు: రైతులకు సూచనలు ఇస్తున్న విస్తరణాధికారి



కురిచేడు: ఆకుముడత తెగులు సోకిన వరి పైరు



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి

కళాశాలకు గోడ గడియారం అందజేత



గోడ గడియారం అందుకుంటున్న అధ్యాపకులు

దొనకొండ: ప్రభుత్వ జూనియర్ కళాశాలకు స్థానిక గౌతమి కాలేజీ తరఫున గోడ గడియారం మంగళవారం అందజేశారు. కళాశాలలో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు గౌతమి కళాశాల ప్రిన్సిపాల్ రామయోగి, అడ్మిన్ నాని పెన్నులు, అట్టలు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.దుమామణి, అధ్యాపకులు ఖాదర్‌వలి, సుందర్, మహాలక్ష్మి, బ్రహ్మం, ఆశీర్వాదం వారిని అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేస్తే చర్యలు



నాటుసారాను ధ్వంసం చేస్తున్న సీఐ శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు

పుల్లలచెరువు: గ్రామాల్లో నాటు సారా తయారు చేసినా..అమ్మకాలు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. జిల్లా అధికారుల ఆదేశాలపై మండలంలోని చిన్న పీఆర్‌సీ తండా పరిధిలో మంగళవారం దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఆ దాడుల్లో 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నాటుసారా తయారు చేసినట్లు తెలిస్తే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు.

కనీస మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు

తాళ్లూరు: రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని కనీస మద్దతు ధరకే కొనుగోలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు అన్నారు. మంగళవారం మన్నేపల్లి, తురకపాలెం, దారంవారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ పౌరసరఫరాల సంస్థ, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పారు. సాధారణ రకం వరి రూ.2300 ఉందని చెప్పారు. రైతులు పండించిన ధాన్యాన్ని ఆర్‌ఎస్‌కేల ద్వారా మాత్రమే అమ్ముకోవాలనే నిబంధన ఏమీ లేదన్నారు. ఎక్కువ రేటు ఎక్కడైనా ఉంటే అక్కడ అమ్ముకోవచ్చన్నారు. వీఏఏలు సుధీర్, నాగమల్లేశ్వరి, రైతులు పాల్గొన్నారు.